క్లుప్తంగా

## రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

**అడ్డాకుల:** మహిళా సంఘాల్లో రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ స్వరూప అన్నారు. మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో మంగళవారం జరిగిన మహిళా సంఘం సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో చంద్రకళ, రాధ తదితరులు ఉన్నారు.

## ధర్నా కరపత్రాల విడుదల

**చిన్నచింతకుంట:** కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్‌ల సమస్యల పరిష్కారానికి ఈనెల 30న హైదరాబాద్‌లోని ఎస్‌పీడీ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టినట్లు ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ధర్నాకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జీఎస్‌దేవదానం, కేజీబీవీ పాఠశాల వర్కర్స్ భాగ్యమ్మ, కాంతమ్మ, జయమ్మ, పద్మమ్మ, సునిత, రామేశ్వరమ్మ, శ్రీదేవి, రుక్షాన తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా దుస్తుల పంపిణీ

**అడ్డాకుల:** మూసాపేట మండలంలోని వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు వడ్ల రవిరాజాచారి మంగళవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాల నుంచి కబడ్డీ, ఖోఖో ఆడే 25 మంది బాలికలు, 25 మంది బాలలకు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాలనర్సిములు, వార్డు సభ్యులు బాలచందర్, నర్సింహ, గ్రామస్తులు కొండారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గద్వాల తిరుపతిరెడ్డి, గోవింద్‌రెడ్డి, నాగరాజు, రాంరెడ్డి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగలో సస్యరక్షణ చర్యలు

**రాజాపూర్:** రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం దోండ్లపల్లి, రాఘవాపూర్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం

**హన్వాడ:** ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎంపీపీ బాల్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 4వ వార్డులో సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ నిధుల నుంచి మంజూరైన నిధులతో సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులు జరగనున్నట్లు వివరించారు. రూ.5 లక్షల నిధులతో చేపట్టే నిర్మాణ పనులను నాణ్యతగా నిర్మించాలని ఎంపీపీ గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవతి, ఉప సర్పంచ్ గంగాపురి, వార్డుసభ్యుడు సత్యం, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్యగౌడ్, జిల్లా రైతు సమన్వయ సమితి డైరెక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నిరసన

**భూత్పూర్:** మండలంలోని తాటికొండ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, లాంగ్వేజ్ పండితుల ఉన్నతీకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎస్‌జీటీ సమానస్థాయి పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించే లోగా షెడ్యూల్లో చేర్చాలని కోరుతూ పీఈటీ లాంగ్వేజ్ పండితుల ఐక్య కార్యాచరణ పిలుపు మేరకు తాటికొండ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. వ్యాయమ విద్య ఉపాధ్యాయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ధూమర్ల నిరంజన్, భాషా పండితులు అత్తర్ పాషా, రమేష్, యాదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓఎల్‌ఎంఎస్‌పై అవగాహన

**మహబూబ్‌నగర్ రూరల్:** ఫర్టిలైజర్ రిటైల్, హోల్‌సేల్ డీలర్లకు కొత్త ఫర్టిలైజర్ ఓఎల్‌ఎంఎస్ విధానంపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామ రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో డీఏఓ బి.వెంకటేష్ ఫర్టిలైజర్ ఓఎల్‌ఎంఎస్ విధానం ఈనెల 26 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు.

## స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని నిరసన

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు స్వామి పాల్గొన్నారు.

## వినతి

**మహబూబ్‌నగర్ న్యూటౌన్:** రైల్వే శాఖ పరిధిలో జర్నలిస్టులకు కల్పించే 50 శాతం రాయితీపై ఇచ్చే పాస్‌లను పునరుద్ధరించాలని కోరుతూ టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకిటి అశోక్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

# ముమ్మరంగా 'కంటి వెలుగు'

**భూత్పూర్:** ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రాంత ప్రజలకోసమే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి సాయిబాబా అన్నారు. మంగళవారం మండలంలోని హస్నాపూర్‌లో కంటి వెలుగులో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. హస్నాపూర్‌లో గత 4 రోజులుగా 879 మంది కంటి పరీక్షలు చేయగా 114 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు, 26 మందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేసినట్లు సీహెచ్‌ఓ రామయ్య మండల ప్రత్యేక అధికారికి వివరించారు.

**గండేడ్:** మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, తహసీల్దార్ జ్యోతి, సర్పంచ్ హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

**రాజాపూర్:** కంటి వెలుగు కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరిని పరీక్షించి అవసరమైన వారికి కళ్ల అద్దాలను అందజేయాలని తహసీల్దార్ రాంబాయి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ మేరకు 154 మంది పరీక్షలు నిర్వహించి 55 మందికి అద్దాలు అందజేయడంతో పాటు మరో 18 మందికి అద్దాలు ఆర్డర్ చేసినట్లు డాక్టర్ మధుసూదన్‌రావ్ తెలిపారు. ఆయుర్వేదిక్ ఆస్పత్రి సిబ్బంది ఉత్తరయ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**మహమ్మదాబాద్:** మండల పరిధిలోని మంగంపేటలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించినట్లే జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా 379మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, వైద్య సిబ్బంది, తదతరులు పాల్గొన్నారు.


హస్నాపూర్‌లో కంటి వెలుగులో వివరాలు తెలుసుకుంటున్న మండల ప్రత్యేక అధికారి సాయిబాబా


రాజాపూర్ పీహెచ్‌సీలో కంటి వెలుగు పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాంబాయి


మంగంపేటలో..

## ఘనంగా బాలికా దినోత్సవం

**స్టేషన్ మహబూబ్‌నగర్:** అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా, కార్యదర్శి మహ్మద్ యాఖూబ్ పాల్గొన్నారు.

**జడ్చర్ల:** బాలికలను చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దితే ఆ కుటుంబం భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటుందని జీహెచ్‌ఎం శౌరీలు తెలిపారు. మంగళవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని కోడ్గల్ జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీహెచ్‌ఎం శౌరీలు

## ఉపాధి వాచర్లకు కూలి ఇవ్వాలి

**మహబూబ్‌నగర్ రూరల్:** ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వాచర్లకు పెండింగ్ కూలి డబ్బులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఓబ్లాయిపల్లి, కోటకదిరలలో ఉపాధి కూలీలతో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు డబ్బులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ఎన్ఐసీ పరిధిలోకి చట్టం వెళ్లిన తర్వాత మరింత ఆలస్యంగా కూలీలకు కూలి డబ్బులు వస్తున్నాయని అన్నారు. రెండు పూటలా ఫొటో విధానాన్ని తీసుకొచ్చి కూలీలను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, సహాయ కార్యదర్శి భగవంతు పాల్గొన్నారు.


సభ్యత్వ రసీదులు అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్

## వైభవంగా మార్కండేయ జయంత్యుత్సవాలు

**మహబూబ్‌నగర్ రూరల్:** జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పద్మావతి కాలనీలోని అయ్యప్పగుట్టపై గల శ్రీ శివమార్కండేయ దేవాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అభిషేకాలను నిర్వహించారు. పద్మశాలి సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ ప్రభాకర్‌రావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బిజ్జ శంకర్, నాయకులు అనంతరాములు, రామస్వామి, సూర్యప్రతాప్, నాగస్వామి, వెంకటేష్, బుచ్చన్న, సత్యానారాయణ, సత్యనారాయణ, తారకం, క భీంపల్లి శ్రీకాంత్, విజయలక్ష్మి, ఉమాదేవి పాల్గొన్నారు.

## ఆధార్ సీడింగ్‌ను పూర్తి చేయాలి


ఈజీఎస్ కూలీల ఆధార్ సీడింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ యాదయ్య

**బాలానగర్:** మండలంలోని ఎస్‌ఆర్‌ఈజీఎస్ కూలీల ఆధార్ సీడింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని డీఆర్‌డీఓ యాదయ్య ఎంపీడీఓ కృష్ణారావు, ఏపీఓ రాజశేఖర్‌రెడ్డిలను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలో జరుగుతున్న ఈజీఎస్ కూలీల ఆధార్ సీడింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆయన ప్రతి ఒక్క ఈజీఎస్ కూలీల ఆధీర్ సీడింగ్ అయ్యి ఉండాలని గుర్తు చేశారు. ఏపీఓ మండల పరిధిలో 7,614 మంది ఆక్టీవ్ వేకర్స్ ఉన్నారని అందులో గత 25 రోజులగా 6,936 మందికి చెందిన ఆధార్ సీడింగ్ పూర్తి చేశామని తెలిపారు. కొంతమంది వలసలుగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు వివరాల్లో కొంత జాప్యం తయారైందని, త్వరలోనే మిగిలిన 678 మంది కూలీల రికార్డులను కూడా సీడింగ్ పూర్తి చేస్తామని తెలిపారు.

## ఇటుకల వ్యాపారి అదృశ్యం.. కేసు నమోదు

**దేవరకద్ర:** స్థానిక మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్డులో ఇటుక వ్యాపారం చేసే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్ఐ భగవంతరెడ్డి తెలిపారు. భవితా కాలేజ్ సమీపంలో నివాసం ఉండే మద్దిగుంట సుబ్బారావు(55) గత కొంత కాలంగా సిమెంట్ ఇటుకలు, రింగులు, హౌస్‌లను తయారు చేసి వ్యాపారం చేసుకుంటున్నాడు. అయితే సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటికి సమీపంలోనే ఉన్న షాపు వద్దకు వెళ్తానని చెప్పి వెళ్లాడు. కానీ షాపు వద్దకు వెళ్లక పోవడంతోపాటు తిరిగి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికిన ఆచూకి లభించలేదని ఎస్ఐ తెలిపారు. కుమారుడు శశికుమార్ మంగళవారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థినికి అభినందన


అభినందిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

**రాజాపూర్:** జాతీయస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైన మండల కేంద్రంలోని అగస్త్య విద్యాలయం విద్యార్థిని మైథిలిని మంగళవారం కలెక్టర్ వెంకట్రావ్ అభినందించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. బాటిల్‌బ్రిక్ అంశంపై జాతీ య స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సురేందర్‌గౌడ్ తెలిపారు. ఉపాధ్యాయులు బాలకృష్ణ, రాజ్‌కుమార్‌లు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో అబ్దుల్ ఖాదర్‌షా ఉర్సు



**స్టేషన్ మహబూబ్‌నగర్:** హజ్రత్ అబ్దుల్ ఖాదర్‌షా రహెమతుల్లా అలై ఉర్సు వేడుకలు మంగళవారం ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చివరి రోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖత్మె ఖురాన్ పఠించారు. అనంతరం జ్యారత్ ఫాతేహా నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ జమీర్‌ఖాద్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, అజీజ్ మాదుం, అన్వర్‌పాష, సలాం మాదుం, నవాజ్‌ఖాన్, రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో విద్యార్థులకు జిల్లా స్థాయి ఉపన్యాస, వ్యాసరచన పోటీలను మంగళవారం నిర్వహించారు. సీనియర్స్ వ్యాసరచనలో సురేష్, అనురాధ, జూనియర్స్ నవీన్, వైష్ణవి, ఉపన్యాస పోటీల్లో సీనియర్స్ శిరీష, శివకుమార్, జూనియర్స్ అనిత, అరుణ్‌కుమార్‌లు నిలిచారు.

**విద్యార్థులకు బహుమతుల ప్రధానం**

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన ఎస్సెస్సీ టాలెంట్‌లో ప్రతిభ కబనర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుతులను అందజేశారు. మొదటి బహుమతిని పంచవటి పాఠశాల విద్యార్థికి రూ.10వేలు, రెండో బహుమతి రిషి పాఠశాల విద్యార్థి రూ.5వేలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూరిత, డాక్టర్ ప్రతిభ, వాగ్దేవీ కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జడ్చర్ల:** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీలలో నసరుల్లాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థి శివకుమార్‌కి డీఈఓ రవీందర్ బహుమతి ప్రధానం చేశారని తెలిపారు.

**బాలానగర్:** నేడు జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమం ఉంటుందని, ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఓటు హక్కుపై అవగాహనతోపాటు నూతన ఓటరు నమోదు ఉంటుందన్నారు.

## ఆలయానికి సీసీ కెమెరాల అందజేత

**అడ్డాకుల:** మూసాపేట మండల కేంద్రంలోని సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రం వద్ద నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయానికి వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం ఆకునోనిపల్లి తండాకు చెందిన ముడావత్ శంకర్ రూ.60వేల విలువైన ఐపీసీసీ కెమెరాలను మంగళవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ మండలం ఇప్పలపల్లికి చెందిన కోట్ల జంగిరెడ్డి ఆలయాభివృద్ధికి రూ.11వేలను సాయం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.తిరుపతయ్యగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, మధు, విశ్వేశ్‌నాథ్, కొండయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి

**పాలమూరు:** తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా ఎం. మధుసూదన్‌రెడ్డిలను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ నాల్గో సభలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు, కార్మిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



## వివాదాస్పదంగా మారిన 'క్లబ్‌హౌస్'

**మహమ్మదాబాద్:** మండల కేంద్రంలోని క్లబ్‌హౌస్ వివాదాస్పదంగా మారింది. గత 40 ఏళ్లక్రితం నిర్మించిన క్లబ్‌హౌస్‌ను మాజీ మంత్రి కమతం రాంరెడ్డి కుటుంబీకులు గ్రామపంచాయతీకి అప్పగించారు. అయితే అప్పటినుంచి క్లబ్‌హౌస్ గ్రామపంచాయతీ పర్యవేక్షణలో కొనసాగుతోంది. ఈ తరుణంలో కమతం కుటుంబీకులు మళ్లీ క్లబ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తూ క్లబ్‌హౌస్‌ను తమ అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తూ క్లబ్ హౌస్‌కు తాళం వేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న క్లబ్‌మెంబర్స్ మంగళవారం క్లబ్‌దగ్గరకు చేరుకుని క్లబ్‌హౌస్ గ్రామపంచాయతీ ఆస్తి అని, గతంలో దానం ఇచ్చిన వ్యక్తులు మళ్లీ స్వాధీనం చేసుకునేందుకు యత్నించడం వారికి తగదన్నారు. అనంతరం వారు తాళం విరగ్గొట్టి తమ తాళాలు వేసుకున్నారు..


క్లబ్‌హౌస్‌కు తాళం వేసుకుంటున్న క్లబ్‌మెంబర్స్

## అదుపుతప్పి ఆటో బోల్తా..

**గండేడ్:** మండల పరిధిలోని రెడ్డిపల్లి గేట్ సమీపంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడడంతో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి సల్కర్‌పేటకు వెళ్లే తరుణంలో ఈప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వారికి ప్రథమ చికిత్సలు చేశారు.

## కోళ్లఫాం షెడ్లలో పారిశుద్ధ్యం పాటించాలి



**చిన్నచింతకుంట:** కోళ్ల ఫాం షెడ్లలో పారిశుద్ధ్యం లోపించకుండా యాజమాన్యం తగు జాగ్రతలు తీసుకోవాలని ఎంపీఓ అనీల్‌కుమార్ కోళ్ల ఫాం యాజమాన్యానికి సూచించారు. మండలంలోని లాల్‌కోట, పల్లమరి గ్రామాల సమీపంలో ఉన్న కోళ్ల ఫాం షెడ్లనుంచి ఈగల బెడద, దుర్వాసన వెదజల్లి ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆయన కోళ్ల ఫాం షెడ్లను పరిశీలించారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**జడ్చర్ల టౌన్:** శాలివాహన సంఘం జడ్చర్ల నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా కిరణ్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి గోపాల్, కోశాధికారి బాలరాజు, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్, కుమార్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు బుగ్గన మంగళవారం ప్రకటించారు.

## వెంచర్ బాధితులకు అండగా ఉంటాం

**జడ్చర్ల:** మండలంలోని మాచారం, కావేరమ్మపేట శివార్లలో గల వెంకటాద్రి వెంచర్ సీ బ్లాక్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి తాము అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తుండగా కొందరు చెడ్డపేరు వచ్చేలా కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే అధికార పార్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. పోలేపల్లి సెజ్ ఏర్పాటుకు కృషి చేయడంతో జడ్చర్ల చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని, అందులో భాగంగానే రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుందన్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లబ్ధిపొంది వేల మంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితిలో భూ ఆక్రమణలు అంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులు అధికార పార్టీపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఊర్కొండ మండల కేంద్రంలో కూడా ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్ చేశారని, తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం పారదర్శకంగా డీటీసీపీ లేఅవుట్ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. అనంతరం బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మి, రాష్ట్ర నాయకులు వాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న బాధితులు

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శెట్టిశేఖర్

**అడ్డాకుల:** మూసాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు శెట్టిశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంకలమద్ది శివారులోని రెయిన్‌బో హోటల్ వద్ద మంగళవారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఎంపిక చేశారు. గతంలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేసిశారన్నారు. అదే విధంగా జానంపేటకి చెందిన బండ రాజేందర్‌రెడ్డిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేశారు. అడ్డాకుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి సమక్షంలో నూతన కమిటీ ఎంపికైంది. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సీజీ గోవర్ధన్‌సాగర్, సంతోషి, నాయకులు పాల్గొన్నారు.


శెట్టిశేఖర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## నర్సరీల పనులు త్వరగా పూర్తి చేయాలి

**నవాబుపేట:** మండలంలోని అన్ని గ్రామాల్లో నర్సరీల పనులు త్వరగా పూర్తి చేసి మొక్కల కోసం విత్తనాలు నాటాలని మండల పంచాయతీ అధికారి బద్రునాయక్ తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కామారం, కేశవరావుపల్లి, మల్కపూర్‌లలో నర్సరీలను పరిశీలించారు.

## చెంచులకు ఇళ్ల స్థలాల పరిశీలన

**మహమ్మదాబాద్:** మండలంలోని చౌదర్‌పల్లి, చిన్నయపల్లి గ్రామాల్లోని చెంచులకు ప్రభుత్వం ఇళ్లస్థలాలను కేటాయించిందని మండల ప్రత్యేకాధికారి ఛత్రునాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని ఆయా గ్రామాల్లోని చెంచు కుటుంబాలను కలిసి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాల విషయాన్ని వివరించారు. మొత్తం 70మందికి ఇళ్లు మంజూరైనట్లు చెంచులకు తెలిపారు. హన్వాడ: పార్టీలకతీతంగా అందరం గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని, ఇందుకు అందరి సహకారం అవసరమని నాయినోనిపల్లి సర్పంచ్ పి. చెన్నయ్య సూచించారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ కార్యక్రమం జరిగింది. ఈ సభలో సర్పంచ్ గ్రామంలో అభివృద్ధి పనులపై మాట్లాడారు. ఐక్యంగా గ్రామాభివృద్ధికి పాటుపడుదామని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**జడ్చర్ల టౌన్:** టై అండ్ డై శిక్షణతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని నాబార్డ్ డీజీఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం బాదేపల్లి పట్టణం శాంతినగర్ మహిళా సమాఖ్య భవనంలో ఇందిరా ప్రియదర్శిని ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన టై అండ్ డై రెండవ బ్యాచ్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్, నిర్వాహకురాలు గోవర్ధని, ఏపీజీవీబీ మేనేజర్ కిరణ్‌కుమార్, ట్యూటర్ నజీర్ పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా రమేశ్‌బాబు

**మహబూబ్‌నగర్ క్రీడలు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా మహ్మదాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.రమేశ్‌బాబు నియమితులయ్యారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆయనను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా డీఈఓ నియామకం చేశారు. 2024 వరకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించనున్నారు.